
సాక్షి
నంద్యాల
మంగళవారం ၊ 3 ၊ అక్టోబర్ ၊ 2023



యాగంటిలో పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో స్వామి వారికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. తొలుత ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం చేశారు.



జిల్లాలో ఎన్ఐఏ సోదాలు

కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులోని ముగ్గురి ఇళ్లలో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. 8లో▸



పెయ్య దూడలే పుడుతున్నాయి!

పెయ్య దూడల అభివృద్ధి పథకం పాడి రైతులకు ఎంతో మేలు చేస్తోంది. జిల్లాలో 2,456 పశువులకు కృత్రిమ గర్భధారణ చేయగా ఇప్పటి వరకు పెయ్య దూడలే పుట్టాయి. 8లో▸

న్యూస్‌రీల్

మహానందిలో కొనసాగుతున్న రద్దీ

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. వేకువజామున సుప్రభాత సేవ సమయం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి రాత్రి వరకు భక్తులు సాధారణ, ప్రత్యేక, శీఘ్ర, ఉచిత దర్శనం క్యూలైన్ల ద్వారా వేచి ఉండి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆర్జితసేవా, అభిషేకాలు, ప్రసాదాల విక్రయాలు, ఇతర విభాగాల ద్వారా ఆలయానికి రెండ్రోజులకు సుమారు రూ.పది లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

ఎండు మిర్చి రూ. 23,250

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులో ఎండు మిర్చి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా సూపర్–10 రకం మిర్చి గరిష్ట ధర క్వింటం రూ.23,250, కనిష్ట ధర రూ.20,500 కాగా మోడల్ ధర రూ.21,200గా పలికింది. ఇక తాలు కాయ క్వింటాలు గరిష్ట ధర రూ.15,700, కనిష్ట ధర క్వింటాలు రూ.10,800, మోడల్ ధర రూ.11,500గా నమోదైనట్లు మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్దే సరకు అమ్ముకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగంలో జిల్లా డాక్టర్లు





మహమ్మద్ రఫీ, మంచాల నిరంజన్‌రెడ్డి

నంద్యాలటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగ కమిటీలో నంద్యాల జిల్లా డాక్టర్లకు చోటు లభించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ముగ్గురిని వివిధ హోదాలలో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు జారీ చేసిన ప్రకటనలో వైఎస్సార్‌సీపీ జిల్లా వైద్యుల విభాగంలో ఇటీవల ఉపాధ్యక్షుడిగా నియమితులైన మహమ్మద్‌రఫిని ఆఫీస్‌స్పోక్స్ పర్సన్‌గా, సెక్రటరీగా పురుషోత్తంరెడ్డి, జాయింట్ సెక్రటరీగా మంచాల నిరంజన్ రెడ్డిని నియమించారు.

పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తి



జూలేపల్లె గ్రామంలో పింఛన్లు పంపిణీ చేసిన డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో అక్టోబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. పింఛన్ల పంపిణీ సోమవారం కొనసాగింది. జిల్లాలో 2,23,208 మంది లబ్ధిదారులు ఉండగా రెండు రోజుల్లో 2,04,810 మందికి (95శాతం) పంపిణీ పూర్తయింది. గోస్పాడు మండలం జూలేపల్లె గ్రామంలో సోమవారం జరిగిన పింఛన్లు పంపిణీని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్లు పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 5వ తేదీన సాయంత్రం 7గంటల వరకు పంపిణీ కొనసాగుతుందన్నారు.

ఆధునికత తోడై.. పశు వైద్యం చేరువై

- మూగ జీవాల ఆరోగ్య భద్రతకు పెద్దపీట
- నియోజకవర్గానికో వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల
- పశు వైద్య అంబులెన్స్‌లతో మెరుగైన సేవలు



నంద్యాలలో ఏర్పాటైన పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం

నంద్యాల(అర్బన్)/నందికొట్కూరు: పశువులు అనారోగ్యానికి గురైతే చాలా మంది రైతులు నాటు వైద్యంతో సరిపెట్టేవారు. పశు వైద్యాన్ని గత ప్రభుత్వాలు విస్మరించడంతో పశు సంపద రక్షణ గాలిలో దీపంలా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశువులకు ప్రయోగశాలలు, అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయం, పశుపోషణపై దృష్టి సారించి రైతులకు అండగా నిలిచారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు మూగ జీవాల పాలిట వరంగా మారాయి. పశువులకు వ్యాపించే వ్యాధులు, సంతానోత్పత్తి, టీకాలు పాల దిగుబడి పెంచడం తదితర పశు ఆరోగ్య సంబంధిత సమస్యలపై తొలి దశలోనే వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టారు. అత్యాధునిక పరికరాలు, అనుభవం కలిగిన వైద్యులను అందుబాటులో ఉంచి పశువుల ఆరోగ్యానికి భరోసా కల్పించారు. నంద్యాల జిల్లాలో నంద్యాల ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం తదితర నియోజకవర్గాల్లో పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది జూలై 8వ తేదీన వైఎస్సార్ జయంతి సందర్భంగా రాష్ట్రప్రభుత్వం పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాల సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని ప్రయోగశాలలో ఇప్పటి వరకు 28,131 వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు.

రూ.100 కోట్లు వెచ్చించి..

ప్రతి ల్యాబ్‌లో భవనం నవీకరణకు రూ. 2.50 లక్షలు, పరీక్షలకు అవసరమైన అత్యాధునిక యంత్ర సామగ్రికి రూ.11 లక్షలు కలిపి రూ. 13.50 లక్షల చొప్పున వెచ్చించారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా ఏడు ల్యాబ్‌లకు రూ. 100 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఈ ల్యాబ్‌లలో 2020 నుంచి వైద్య పరీక్షలు చేస్తున్నప్పటికీ దశల వారీగా వీటి మరింత అభివృద్ధి చేశారు. నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంతో పాటు బనగానపల్లె, డోన్, ఆత్మకూరు నియోజకవర్గాలలో డిపార్ట్‌మెంట్ ల్యాబ్‌లు, నందికొట్కూరు, పాణ్యం, ఆళ్లగడ్డ నియోజకవర్గ కేంద్రాల్లో అగ్రి ల్యాబ్‌లను నెలకొల్పారు. ప్రతిచోట కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఒక సహాయకుడిని నియమించారు.

అత్యాధునిక పరికరాలు..

బయోకెమికల్ అనలైజర్: పశువుల కాలేయం, లివర్, కిడ్నీలు పని చేస్తున్న విధానంతో పాటు పోషక లోపాలు ఎదకు రాలేకపోవడం వంటి వాటిని గుర్తిస్తారు.

మైక్రో స్కోప్: పశువుల రక్తంలో పరాన్న జీవులను గుర్తించడం, పేడ పరీక్షలు, రక్తహీనత, రక్త కణాలు ఎంత శాతంలో ఉన్న వాటిని గుర్తించవచ్చు.

ఇంకుబేటర్: పశువుల వ్యాధులకు సంబంధించి ఎలాంటి యాంటీబ్యాటిక్ వాడాలనే దానిని తెలుపుతుంది.

ల్యామినర్ ఎయిర్ ఫ్లో: వ్యాధి కారక క్రిములను గుర్తించడం, యాంటిబ్యాటిక్ పరీక్షలు చేసేందుకు ఉపయోగపడుతుంది.

హాట్ ఎయిర్ ఓవెన్: పశువుల స్టెరిలైజేషన్‌ను తెలుసుకోవడమే కాకుండా అన్ని రకాల పరీక్షలు చేసేందుకు వీలవుతుంది.

జీవనోపాధిని బతికించారు

చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు వీరారెడ్డి, పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం కొంతలపాడు గ్రామం. వ్యవసాయంలో ఆసరాగా ఉన్న తన ఒంగోలు జాతి ఎద్దుకు ఇటీవల మెడ వంకర పోయి అనారోగ్యానికి గురైంది. గడ్డి తినలేకపోవడంతో రైతు ఆందోళన చెంది వెంటనే పాణ్యం పశు ప్రయోగశాల వైద్యులు కమలాకర్‌ను సంప్రదించాడు. ఆయన పశువును పరీక్షించి రక్తనమూనాలు సేకరించి ఫలితం కోసం కర్నూలు ల్యాబ్‌కు పంపారు. ఎద్దుకు అందిస్తున్న దాణా, పశుగ్రాసా ల్లో పొటాషియం లోపించడంతో అనారోగ్యానికి గురైనట్లు ల్యాబ్ నుంచి రిపోర్ట్ వచ్చింది. వెంటనే మూడు రోజుల పాటు పొటాషియంకు సంబంధించిన మందులను ఇంజెక్షన్ల రూపంలో వేయగా ఎద్దు కోలుకుంది. దాదాపు రూ.లక్ష విలువ చేసే ఎద్దును వైద్యులు కాపాడారు.



ప్రభుత్వం అందిస్తున్న పశు వైద్య సేవలపై వీరారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసి రైతు సంక్షేమానికి పాటుపడుతుందన్నారు.



బొల్లవరంలో గేదె పేడను పరీక్షిస్తున్న పశు వైద్యులు

జిల్లాలో పశువుల వివరాలు

పశువులు	సంఖ్య
గేదెలు	2,93,830
ఆవులు	1,20,565
గొర్రెలు	8,22,449
మేకలు	3,05,854
కోళ్లు	71,126
పందులు	2,800

ల్యాబ్‌ల్లో ఈ ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు చేసిన పరీక్షల వివరాలు

నియోజకవర్గం	పరీక్షలు
బనగానపల్లె	2,422
డోన్	6,172
ఆత్మకూరు	2,857
నంద్యాల	3,250
నందికొట్కూరు	2,945
పాణ్యం	4,917
ఆళ్లగడ్డ	5,568
మొత్తం	28,131

1962కి ఫోన్ చేస్తే..

దేశంలో ఎక్కడ లేని విధంగా ఇప్పటికే పశు వైద్య సేవల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1962తో ప్రతి నియోజకవర్గానికి అంబులెన్స్‌లు సమకూర్చింది. ఈ నెంబరుకు ఫోన్ చేస్తే పశు వైద్యులు, సిబ్బంది అంబులెన్స్‌తో పశువు ఉన్నచోటికే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. అవసరమైతే అదే అంబులెన్స్‌లో సమీప పశు వైద్య కేంద్రానికి తరలిస్తున్నారు. దీనివలన అనారోగ్యానికి గురైన పశువులను వ్యయప్రయాసలతో పశు వైద్య కేంద్రానికి తరలించాల్సిన ఇబ్బందులు ఉండవు.

రెండు ఆవులను కాపాడారు



మాకు ఏడు ఆవులు, రెండు గొర్రెలు, నాలుగు కోడె దూడలు ఉన్నాయి. ఇటీవల రెండు ఆవులు లంపీ స్కిన్ వ్యాధి బారిన పడ్డాయి. వెంటనే 1962కు ఫోన్ చేసి ఆవుల పరిస్థితి వైద్యులకు వివరించాను. నందికొట్కూరు నుంచి గంటలోపు మా ఇంటికి వచ్చి ఆవులకు వైద్యం చేశారు. పైసా ఖర్చు లేకుండా వైద్యం, మందులు ఉచితంగా ఇచ్చారు. నాలుగు రోజుల్లో రెండు ఆవులు కోలుకున్నాయి. అడగకుండానే మనుషులతో పాటు పశువులకు కూడా ఇంటింటికీ వెళ్లి వ్యాధి నిర్ధారణ పథకం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కింది. ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి పథకం అమలు చేయలేదు.

– జక్కుల రాఘవేంద్ర శాతన
కోట గ్రామం, నందికొట్కూరు మండలం

ల్యాబ్‌ల్లో ప్రయోగాలు ఇలా..

- పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, తదితర జంతువులకు సంక్రమించే వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- ఒక్కో ల్యాబ్‌కు ప్రతి నెలా లక్ష్యాన్ని నిర్దేశించి అందుకనుగుణంగా పరీక్షలు చేస్తున్నారు.
- పశువుల మూత్రం, పేడ, చర్మ సమస్యలకు సంబంధించిన నమూనాలను ప్రయోగశాలల్లో పరీక్షించి వ్యాధి లక్షణాలు గుర్తిస్తారు.
- పశువులకు పలు రకాల టీకాలు వేశాక వాటి పనితీరు, పశువుల్లో ఏవైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం వంటి ప్రయోగాలు కొనసాగుతున్నాయి.
- పశువుల నుంచి మనషులకు సంక్రమించే వ్యాధులను గుర్తించడం జరుగుతోంది.
- ముఖ్యంగా బ్రూసెల్ (పునరుత్పత్తి లేకపోవడం) వ్యాధిని గుర్తించడం, యాంటీ బయోటిక్ నిర్ధారణ పరీక్షలు, పాలు, రక్త నమూనాలు సేకరించి ఏఏ రకాల మందులు ఇస్తే పశువుకు నయమవుతుందో గుర్తించడం, వ్యాధులబారిన పడి మృతి చెందిన పశువులకు పోస్టుమార్టం, తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- గొర్రెలు, మేకలకు సోకే నట్టల నిర్ధారణ, నివారణకు తగిన మందులు ఇచ్చే ప్రయోగాలు కొనసాగుతున్నాయి.
- కోళ్లకు సంక్రమించే వ్యాధులను సైతం ఈ ప్రయోగశాలల్లో గుర్తిస్తున్నారు.
- ఏటా ప్రయోగాల కోసం ఉపయోగించే రసాయన ద్రావణాలు, ఇతర పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం ఒక్కో ప్రయోగశాలకు రూ. 2 లక్షల నిధులు కేటాయిస్తోంది.



మైక్రో స్కోప్ ద్వారా పరాన్న జీవులను గుర్తిస్తూ..



పశువుల్లో పోషక లోపాలను గుర్తించే బయోకెమికల్ అనలైజర్

వ్యాధి గుర్తించి పశువులను కాపాడుకోవాలి



పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలతో రైతులకు అంతా మంచే జరుగుతోంది. ప్రస్తుతం వర్షకాలంలో పశువులకు అనేక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది. అనారోగ్యానికి గురైన పశువులకునిర్ధారణ పరీక్షలు చేయించాలి. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే పశువులను కాపాడుకోవచ్చు. ప్రభుత్వం అన్ని సేవలను ఉచితంగా అందిస్తుంది.

– జి.రవిబాబు, సహాయ సంచాలకులు, కర్నూలు
జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం

జాతిపిత బాటలో నడుద్దాం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సన్మార్గంలో ఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. సోమవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లోని గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిషా తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అహింసా మార్గంలో నడిచి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన జాతిపిత మహాత్మా గాంధీ ప్రపంచానికే స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. మహాత్ముడు నేర్పించిన సిద్ధాంతాలు, ఆదర్శాలను ఆదర్శంగా తీసుకుని తప్పకుండా పాటించాలని సూచించారు. పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందనే సదుద్దేశంతో గ్రామ, వార్డు సచివాలయాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీ జయంతిని ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అహింసా మార్గంలో సత్యాగ్రహమే ఆయుధంగా పోరాడి బ్రిటిష్ పాలకులను తరిమికొట్టి అఖండ భారతావనికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ప్రసాదించిన ఘనత జాతిపిత మహాత్మా గాంధీదే అన్నారు. సమాజంలో శాంతిని ఎల్లప్పుడూ కోరుకొనే పోలీసుశాఖ మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి మార్గంలోనే పయనించాలని సూచించారు. ప్రజల్లో కూడా ఆదే మార్పును తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ వెంకటరాముడు, ఎఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ రంగముని తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం.. అనుసరణీయం

బాపూజీ.. సత్యం, అహింసల మార్గ జ్యోతి.. స్వదేశీ ఉద్యమంతో బ్రిటీష్ వారిని వణికించిన ధీశాలి. ఉప్పు సత్యాగ్రహంతో దండి యాత్రను దండయాత్రగా ముందుకు నడిపిన అధినేత. జాతి పిత మహాత్మా గాంధీ జ్ఞాపకాలను గుర్తు చేస్తూ కర్నూలు నగరంలోని బిర్లాగడ్డ వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దండి మార్చ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఈ విగ్రహాన్ని కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్, జేసీ నారపురెడ్డి మౌర్య, నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ తదితరులు ప్రారంభించారు. మహాత్ముని మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. –సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



మహాత్ముడి కల నెరవేర్చిన ఘనత జగన్‌దే

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం పెట్నికోట గ్రామ సచివాలయంలో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చి నిజమైన గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఈ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో ప్రజల వద్దకే పథకాలు చేరేలా చేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతో మంది పేద ప్రజలకు వరంలా మారిందన్నారు. స్పెషలిస్టు వైద్యులతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందించి మందులు అందిస్తున్నారని గుర్తు చేశారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. శాంతి, అహింసా పద్ధతులు అవలంబించి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రామలింగేశ్వరమ్మ, పంచాయితీ కార్యదర్శి రాఘవరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏపీఓ గంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, కొండారెడ్డి, చంద్రమోహన్, రామిరెడి, పుల్లన్న, సమత ఫౌండేషన్ ప్రతినిధి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు

కర్నూలు(సెంట్రల్): కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రంగస్థల కళాకారులు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డులను జారీ చేస్తుందని తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాల కోసం జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖాధికారి కార్యాలయాన్ని సందర్శించాలని ఆయన సూచించారు.

ఎఫ్‌ఏ-2 పరీక్షలు వాయిదా

కర్నూలు సిటీ: సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా 8, 9 తరగతులకు ఎఫ్ఏ–2 పరీక్షలు వాయిదా వేసినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, ప్రీ హైస్కూల్‌లో 6, 7 తరగతులు, 10వ తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ-2 పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్‌తో పరీక్షలు ఈ నెల 6 నుంచి 9వ తేది వరకు జరుగనున్నాయన్నారు. జిల్లాలో 100 పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్నారన్నారు. 2025లో పదవ తరగతి పరీక్షలు సీబీఎస్ఈ సిలబస్‌తోనే నిర్వహిస్తామన్నారు.

శ్రీశైలానికి పది వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాజెక్టుల నుంచి సోమవారం సాయంత్రానికి 10,125 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. జూరాల నుంచి 7,879 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 2,264 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఆదివారం నుంచి సోమవారం వరకు జలాశయం నుంచి 5,139 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతాలకు విడుదలయ్యింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,550 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,488 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 94.0190 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 855.80 అడుగులకు చేరుకుంది.

క్లుప్తంగా

యువకుడి అనుమానాస్పద మృతి


ఇమ్రాన్ (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటకు చెందిన షరీఫ్ కుమారుడు ఇమ్రాన్ (25) సోమవారం స్టేషన్‌కు సమీపంలో రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని పెట్రోలు బంక్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్న ఇమ్రాన్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తలపై మినహా శరీర భాగాలపైన ఎక్కడా గాయాలు లేకపోవడంతో ఎవ్వరైనా కొట్టి చంపి రైల్వే ట్రాక్ మధ్యలో పడేసి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఉదయం రైల్వే సిబ్బంది గమనించి నంద్యాల రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పట్టపగలే చోరీ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలో నివాసముంటున్న జాకీర్ అనే వ్యక్తి ఇంట్లో సోమవారం పట్టపగలే దొంగలు పడ్డారు. పని మీద ఇంటికి తాళం వేసి జాకీర్ కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 7తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి నగలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేశారు.

మోటార్ దొంగ అరెస్ట్

ఓర్వకల్లు: విద్యుత్ మోటార్ చోరీ చేసిన దొంగను సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. హుసేనాపురం గ్రామానికి చెందిన మాశపోగు సుధాకర్ కాల్వ, బ్రాహ్మణపల్లె, పాలకొలను, నన్నూరు గ్రామ పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో ఒక విద్యుత్ మోటారు, 8 నీటి పైపులు, 31 ప్లాస్టిక్ నల్లటి పైపులు, 25 కిలోల రాగి తీగను దొంగలించినట్లు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు విచారణ జరిపారు. విద్యుత్ మోటార్, నీటి పైపులు, ప్లాస్టిక్ పైపులు, రాగి తీగను స్వాధీనం చేసుకొని, దొంగతనానికి ఉపయోగించిన టాటా ఏస్ ట్రాలీ ఆటో(ఏపీ 21 టీవై 4657)ను స్వాధీనం చేసుకుని, నిందితున్ని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

పెయ్య దూడలే పుడుతున్నాయి!

- రైతులకు అండగా పెయ్య దూడల అభివృద్ధి పథకం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,456 పశువులకు కృత్రిమ గర్భధారణ
- ఇప్పటి వరకు పుట్టినవన్నీ పెయ్య దూడలే
- సబ్సిడీ పోను రూ.500తో కృత్రిమ గర్భధారణ
- రెండు డోసులకు చూలు కట్టకపోతే డబ్బు వెనక్కి


కృత్రిమ గర్భధారణ సూది వేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం అమలు చేస్తున్న పెయ్య దూడల అభివృద్ధి పథకం సత్ఫలితాలను ఇస్తోంది. పాల ఉత్పత్తిని పెంచుకునే అవకాశం ఏర్పడుతోంది. పశుగణాభివృద్ధి సంస్థ కొన్నేళ్లుగా చేపడుతున్న కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం కింద వేసిన సూదులతో 50 శాతం వరకే పెయ్య దూడలు పుడుతున్నాయి. రైతులకు మరింత మేలు చేసే విధంగా ప్రభుత్వం లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఈ విధానం వంద శాతం ఫలితాలను ఇస్తోందని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. పెయ్య దూడల అభివృద్ధి పథకాన్ని ఐదేళ్లపాటు అమలు చేయనున్నారు. ఈ పథకాన్ని పశు సంవర్ధకశాఖ అధికారులు, గోపాలమిత్రలు, పారా సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. దీంతో అధిక పాలసార కలిగిన మేలు జాతి ఆవులు, బర్రెలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

పాడి రైతుల్లో ఆనందం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 2,456 ఆవులు, బర్రెలకు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేశారు. వీటిలో 436 ఆవులు, 2,020 గేదెలు ఉన్నాయి. చూలు కట్టినప్పటి నుంచి ఆవులు 9 నెలల 9 రోజులకు, బర్రెలు 10 నెలల 10 రోజులకు ఈనుతాయి. ఇప్పటి వరకు నెలలు నిండటంతో 36 బర్రెలు, గోవులు ఈనగా..అన్నింటికీ పెయ్య దూడలే పుట్టడంతో రైతులకు ఆనందాన్ని ఇస్తోంది. నంద్యాల జిల్లాలో 30, కర్నూలు జిల్లాలో 6 పశువులు ఈనాయి.


పుట్టిన ముర్రా జాతి పెయ్య దూడ

పెరగనున్న ఆదాయం

'పెయ్య దూడలు పుట్టాలి.. రైతన్నకు లక్ష్మీకళ పట్టాలి...నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు' అనే నినాదంతో పెయ్యదూడల అభివృద్ధి పథకాన్ని పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సిబ్బంది రైతుల్లోకి తీసుకపోతున్నాయి. లింగనిర్ధారిత వీర్యం ఉపయోగించడంతో రైతులకు అవసరమైన.. మేలైన పెయ్యదూడలను 95 శాతంపైగా కచ్చితత్వంతో పుట్టించడం ద్వారా పాల దిగుబడి పెరగనుంది. దీంతో రైతుల ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఏర్పడింది, అలాగే గ్రామాల్లో మేలు జాతి పశుసంపద వృద్ధి చెందనుంది. పాడి అభివృద్ధికి ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకాన్ని పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, నాన్ గవర్నమెంటు ఆర్గనైజేషన్‌లు, ఇతర రైతు సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ అధికారులు కోరుతున్నారు.

సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం

లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ సూది పూర్తి ధర రూ.1,350 ఉండగా ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తోంది. రైతులు రూ.500 భరించాల్సి ఉంది. మొదటి డోసుతో చూలు కట్టకపోతే రెండో సారి కూడా వేస్తారు. రెండు డోసులకు కలిసి ప్రభుత్వం ఈ ధరను నిర్ణయించింది. ఆవులు, గేదెలకు లింగనిర్ధారణ వీర్యంతో ఎదకు వచ్చినపుడు మాత్రమే సూది వేస్తారు. 21 రోజుల్లో మళ్లీ ఎదకు రాకపోతే చూలు కట్టినట్లే. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 2,456 పశువులకు లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయగా 36 ఈనాయి. తొమ్మిది నెలలు నిండిన 86 ఉన్నాయి. రెండు డోసులు వేసినా పశువు చూలు కట్టకపోతే రైతు చెల్లించిన రూ.500 వెనక్కి చెల్లిస్తారు. చూలు కట్టి మగ దూడ పుడితే రూ.250 వెనక్కి ఇస్తారు.

పాల ఉత్పత్తి పెంచుకోవచ్చు



పదినెలల క్రితం రెండు బర్రెలకు కృత్రిమ గర్భధారణ సూది వేయించాం. ఒకే డోసుతోనే చూలు కట్టాయి. ఇటీవల రెండు బర్రెలకు పెయ్య దూడలు పుట్టాయి. పెయ్య దూడలు పుట్టడంతో పాల ఉత్పత్తిని మరింత పెంచుకునే అవకాశం ఏర్పడింది.

– రమణ, యాళ్లూరు, నంద్యాల జిల్లా

గిర్ జాతి దూడ పుట్టింది



మాకు నాటు ఆవులు ఉన్నాయి. తొమ్మిది నెలల క్రితం సూది వేయించాం. ఇటీవలే ఒక ఆవుకు గిర్‌జాతి పెయ్య దూడ పుట్టింది. ప్రభుత్వం పెయ్య దూడల అభివృద్ధి పథకం కింద సబ్సిడీపై సూదులు వేయడం పాడి రైతుకు కలసివస్తోంది.

– లక్ష్మిదేవి, నందవరం, కర్నూలు జిల్లా

రైతులకు వరం



పాడి రైతులకు పెయ్యదూడల అభివృద్ధి పథకం వరం లాంటిది. గతంలో కృత్రిమ గర్భధారణ సూదులు వేస్తే 50 శాతం వరకే పెయ్య దూడలు పుట్టేవి. మేలు జాతి లింగనిర్ధారిత వీర్యంతో 95 శాతం వరకు పెయ్య దూడలు పుడుతున్నాయి. దీంతో పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 2,456 పశువులకు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించాం.

– డాక్టర్ రాజశేఖర్, డీడీ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, ఉమ్మడి కర్నూలు జిల్లా

జిల్లాలో ఎన్‌ఐఏ సోదాలు

కర్నూలు/ఆదోనిఅర్బన్/ఎమ్మిగనూరురూరల్: జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఎన్‌ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) అధికారులు సోమవారం సోదాలు చేశారు. ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీ 6వ వార్డులో నివాసముంటున్న మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు ఇంట్లో డాక్యుమెంట్లను పరిశీలించారు. మానవహక్కుల వేదిక సంస్థ కరపత్రాలు, సీడీలు, సాహిత్య ప్రచురణ పుస్తకాలు పరిశీలించి వాటిని సీజ్ చేశారు. నవంబర్ 8న హైదరాబాద్‌లో ఎన్‌ఐఏ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని యు.జి.శ్రీనివాసులకు నోటీసు ఇచ్చారు. ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీజ్ చేసిన వాటిని పోలీసులకు అప్పగించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని గాంధీనగర్‌లో మానవ హక్కుల వేదిక నేత యు.ఎం.దేవేంద్రబాబు ఇంట్లో కూడా ఎన్‌ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎన్‌ఐఏ కార్యాలయం సీఐ జక్కా ఓబులేస్ మాట్లాడుతూ.. దేవేంద్రబాబుపై హైదరాబాద్‌లో 2021 జూలై 3వ తేదీన వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు అయినట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో విచారణకు హైదరాబాద్‌లోని ఎన్‌ఐఏ కార్యాలయానికి రావాలని నోటీస్ ఇచ్చినట్లు చెప్పారు.


ఎమ్మిగనూరులో సోదాలు చేసేందుకు వచ్చిన ఎన్‌ఐఏ పోలీసులు

కర్నూలులో..

కర్నూలు శివారులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ కాలనీలో నివాసముంటున్న ఎ.వి. సుబ్బారాయుడు ఇంట్లో ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈయన కల్లూరు మండలం లక్ష్మీపురం జిల్లాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా పనిచేస్తున్నాడు. ఈయన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు 2021 మార్చి 7న హైదరాబాద్‌లోని ఎన్‌ఐఏ కార్యాలయంలో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. నిఘా వర్గాల సూచనల మేరకు ఎన్‌ఐఏ ఎస్‌ఐ ఈశ్వర్ సింగ్ నేతృత్వంలో సోమవారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సుబ్బారాయుడు ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. విప్లవ సాహిత్యానికి సంబంధించిన రెండు బుక్‌లు, కొన్ని కరపత్రాలు, సెల్‌ఫోన్‌ను ఆయన వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నవంబర్ 7న మరోసారి హైదరాబాద్‌లోని ఎన్‌ఐఏ ఆఫీసులో విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసు ఇచ్చి వెళ్లారు.

అక్రమంగా వెదుర్ల రవాణా

- నలుగురిపై కేసు నమోదు

మహానంది: అక్రమంగా వెదుర్లను తరలిస్తూ అటవీశాఖ సిబ్బందిపై వాగ్వాదానికి దిగిన నలుగురు వ్యక్తులపై అటవీశాఖ చట్టం మేరకు కేసులు నమోదు చేసినట్లు బండిఆత్మకూరు ఎఫ్‌ఆర్‌ఓ నాసిర్‌జా తెలిపారు. గత నెల 30న ఎరుకల కాలనీకి చెందిన కొందరు బొలేరో వాహనంలో అక్రమంగా వెదుర్లను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బంది తనిఖీలు చేశారన్నారు. వాహనంలో గంపలతో పాటు వెదుర్లను గుర్తించామని, పర్మిట్లు అడిగితే లేకపోగా సిబ్బందిపై వాగ్వాదానికి దిగారన్నారు. దీంతో నంద్యాల డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు ఎరుకల కాలనీకి చెందిన మల్లె ఆంజనేయులు, రంజిత్, శ్రీను, శ్రీనాథ్‌లపై అటవీ హక్కుల చట్టాల మేరకు కేసు నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

హాజరుతో సంబంధం లేకుండా పరీక్షలకు అనుమతి

నంద్యాల(న్యూటౌన్): కళాశాల హాజరు శాతంతో సంబంధం లేకుండా ఇంటర్ పరీక్ష రాసేందుకు ఇంటర్ విద్యా మండలి ఒక సువర్ణ అవకాశాన్ని అందించిందని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సునిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పరీక్షలు రాసే విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చన్నారు. అదే విధంగా పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సంవత్సరం గ్యాప్ ఉన్నా ఇంటర్ పరీక్ష రాయవచ్చన్నారు. రెండు సంవత్సరాలు గ్యాప్ ఉంటే ఇంటర్మీడియెట్ మొదటి, రెండు సంవత్సరాలు పరీక్షలు రాయడానికి అర్హత పొందుతారన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జ్ఞాపకాల జడివాన


1980-82లో ఇంటర్మీడియట్ చదివిన సహచర విద్యార్థులతో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

- వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోవెలకుంట్ల: గుర్తుకొస్తున్నాయని అంటూ ఆనాటి విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దాదాపు నాలుగైదు దశాబ్దాల క్రితం ఒకే పాఠశాల, కళాశాలలో చదువుకున్న విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్ హాలు ఇందుకు వేదికమైంది. కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో 1960 నుంచి 1990వ సంవత్సరం వరకు పది, ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులంతా సమ్మేళనమయ్యారు. ఆయా విద్యా సంవత్సరాల్లో చదువుకున్న సుమారు 500 మంది పూర్వ విద్యార్థుల ఈ కార్యక్రమంలో కలుసుకున్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొంది హైదరాబాదు, బెంగళూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో స్థిరపడిన రిటైర్డ్ ఉద్యోగులు, ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు చేస్తున్న పలువురు ఈ వేదిక ద్వారా కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 50 సంవత్సరాలు పైబడిన తర్వాత కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటలను పంచుకున్నారు. అప్పట్లో కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివిన ప్రస్తుత నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, తదితర ప్రముఖులు పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరై స్నేహితులను కలుసుకున్నారు. ఆయా విద్యా సంవత్సరాల్లో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళానికి ప్రధాన పాత్ర పోషించిన పాణ్యం నాగార్జునకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం కోవెలకుంట్ల చరిత్రకు సంబంధించి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఉమ్మడి విజేతలుగా వైజాగ్, శ్రీకాకుళం

మహానంది: మహానందిలో మూడు రోజులుగా జరిగిన ఏపీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖపట్టణం, శ్రీకాకుళం జట్లు ఉమ్మడి విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం మహానందిలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో బహుమతుల ప్రదానం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు, మెమొంటోలు అందించారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన రెండు జట్ల క్రీడాకారులు త్వరలో చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి బాలమద్దిలేటి తెలిపారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

టీచర్లు మందలించడంతో విద్యార్థిని అదృశ్యం

- సీసీ టీవీ ఫుటేజీల ద్వారా ఆచూకీ లభ్యం

డోన్ టౌన్: టీచర్లు మందలించడంతో విద్యార్థిని అదృశ్యమైన ఘటన పట్టణంలోని శ్రీసుధ స్కూల్లో చోటు చేసుకుంది. దొరపల్లె గ్రామానికి చెందిన సుచిత్ర 8వ తరగతి చదువుతోంది. సోమవారం క్లాస్ టీచర్, ప్రిన్సిపాల్ మందలించడంతో మధ్యాహ్నం ఎవ్వరికీ చెప్పకుండ వెళ్లిపోయింది. గాంధీ జయంతి రోజున మధ్యాహ్నం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు స్కూల్ దగ్గరికి వచ్చి విచారించారు. సుచిత్ర స్కూల్లో లేక పోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థినీ ఆచూకీ కోసం గాలిస్తూ వాట్సాప్ మెసేజీలు పంపారు. చివరకు స్కూల్లో సీసీ టీవీ ఫుటేజ్‌లను, పట్టణంలోని మరికొన్ని సీసీ ఫుటేజ్‌ల ద్వారా సుచిత్ర కొత్తపేటలో ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యంతో అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వేలకు వేలు ఫీజులు కడుతున్నా అమ్మాయిలకు సరైన భద్రత కల్పించకపోతే ఎలాగని నిలదీశారు. ఎట్టకేలకు అమ్మాయి దొరకడంతో అందరూ ఊపరిపీల్చుకున్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ


ఇంట్లో జరిగిన దొంగతనం తీరును పరిశీలిస్తున్న ఎస్‌ఐ మారుతిశంకర్

జూపాడుబంగ్లా: కుటుంబ సమేతంగా ఓ ఉపాధ్యాయుడు ఇంటికి తాళం వేసి తీర్థయాత్రకు వెళ్లివచ్చేలోగా ఇంటిల్లో దొంగలు పడి ఉన్నదంతా దోచుకెళ్లారు. ఈ సంఘటన మండల కేంద్రం జూపాడుబంగ్లాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపిన వివరాల మేరకు.. తాటిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ జూపాడుబంగ్లాలో నివాసముంటున్నారు. గతనెల 30న కుటుంబ సభ్యులతో తిరుమలకు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగొచ్చిన ఆయన ఇంటి ద్వారం తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి ఇంట్లో దొంగతనం జరిగినట్లు తెలుసుకొని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎస్‌ఐ మారుతిశంకర్, రూరల్ సీఐ విజయభాస్కర్ అక్కడికి చేరుకుని చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇంట్లోని బీరువాలో దాచిన రూ.1.50 లక్షల నగదు, రూ.75వేల విలువైన బంగారు, రూ.3 వేల విలువైన వెండి పట్టీలు చోరీకి గురైనట్లు బాధితుడు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కర్నూలు నుంచి క్లూస్‌టీం బృందాన్ని రప్పించి వేలిముద్రలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీశైలక్షేత్రం కైలాసంతో సమానం

- బ్రహ్మశ్రీ సామవేద షణ్ముఖశర్మ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రం కైలాసంతో సమానమని, సాక్షాత్తు పరమేశ్వరుడు పార్వతీతో అన్నట్లుగా స్కాందపురాణంలోని శ్రీశైలఖండంలో చెప్పబడిందని ప్రముఖ ప్రవాచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీశైల మహిమా విశేషాలపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ వారిచే తొమ్మిది రోజుల పాటు ప్రవచనాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రెండవ రోజు సోమవారం ఆయన పర్వతుని తపస్సు, శ్రీశైల సందర్శన ఫలం మొదలైన విశేషాలను వివరించారు. శ్రీశైలం క్షేత్రంగా, తీర్థంగా ప్రసిద్ధమైందన్నారు. నందీశ్వరుడు తపస్సు ద్వారా శివపరివారములో ప్రథముడై, ప్రధానుడై, గణాలన్నింటికీ నాయకుడై, ద్వితీయశంభుడు అనే పేరు పొందాడన్నారు. నందీశ్వరుని వలే పర్వతుడు కూడా తపస్సుతో పరమేశ్వరుడిని మెప్పించాడని అన్నారు. పర్వతుడు తానే పర్వతంగా మారి పరమేశ్వరుని తనపై కొలువుతీరే వరాన్ని పొందాడన్నాడు. ఆ పర్వతమే శ్రీశైలమని తెలిపారు. అలాగే పలు ధార్మిక విశేషాలను వివరించారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా జైలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

- జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు: ఖైదీలు సత్ప్రవర్తనతో నడచుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని పంచలింగాల గ్రామ సమీపంలో ఉన్న జిల్లా కారాగారంలో ఆయన విగ్రహానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటనాగ శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ టి.సర్కార్‌తో కలిసి జేసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఖైదీల సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్నారు. జాతిపితజయంతి రోజునాడే ఖైదీల సంక్షేమ దినోత్సవం కూడా జరుపుకుంటున్నామని జేసీ అన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఖైదీలు నేర ప్రవర్తనను మనసులో నుంచి తీసేసి బాధ్యత గల పౌరులుగా ఉండాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటనాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో తన కోసం తాను జీవించకుండా ప్రజల కోసం జీవించేవారికి మరణమే లేదన్నారు. ప్రతి మనిషి నేరం చేయాలనే ఆలోచనను మనసు నుంచి తీసేసి స్వేచ్ఛగా బతకాలని ఖైదీలకు సూచించారు. ఒక్కసారి జైలుకు వచ్చిన వ్యక్తి మళ్లీ జైలుకు రాకుండా మార్పు రావాలన్నారు. మత్తు పదార్థాలను విక్రయించడం, సేవించడం వల్ల దాదాపు 40 మంది ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నారని, భవిష్యత్తులో వాటి జోలికి వెళ్లకుండా పరివర్తన చెందాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ గణేనాయక్ మాట్లాడుతూ జైలులో నిరక్షరాస్య ఖైదీలకు విద్య నేర్పుతున్నామని, జైలుకు వచ్చినప్పుడు వేలి గుర్తు వేసేవారు తిరిగి వెళ్లేటప్పటికి సంతకం చేసేలా తయారవుతున్నారని చెప్పారు. ప్రస్తుతం 60 మంది ఖైదీలు జైలులో ఉన్నారని తెలిపారు. డీఎస్పీ విజయ శేఖర్, హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మేకల మహేష్‌కుమార్, జైలర్ ఎరికి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

THIS IS WHERE OPPORTUNITIES AWAIT YOU
SO,COME AND FINDYOUR BEST JOB HERE!
Positions Available:-
B.D.E'S (Female's Age 18-30)
B.P.O'S (Female's Age 18-30)
Receptionist (Female Age 18-25)
Collection Executive (Male 18-25)
Salary+Bonus +Insentives
03/10/2023
04/10/2023
10.00 to 2.00 PM
Qualification :- 10th, Inter Degree & Above
Earn upto 10,000/ to 25000/- P.M (No Field Work Only Office Work)
RAYS CAPITALS
54/14-68-C-2-B Thalavari Street, Opposite R.T.C.Bustand,
Beside Surakshitha Hospital, KURNOOL-518001.Ph: 6309789588, 8886652302.

అనుభవజ్ఞులైన సూపర్‌వైజర్‌లు, ఆర్టిస్టులు & వాల్ పెయింటర్‌లు కావలెను
ఒక థీమ్‌తో బిల్డింగ్ ముందు భాగమును వాల్ పెయింటింగ్ చేసి వాటిపై లోగోలను వేయటానికి జిల్లాల వారీగా అనుభవజ్ఞులైన వాల్ పెయింటర్‌లు మరియు ఆర్టిస్టులు (బొమ్మలు వేయువారు) కావలెను. (వ్యక్తులుగా లేదా గ్రూపులుగా).
ఆసక్తి కలవారు ఈ నెంబరులో వెంటనే సంప్రదించండి.
9652456789, 9849200077

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION
■ శ్రీ వెంకటేశ్వర అకాడమి ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ఒకే సం॥లో 10th, ఇంటర్ (All Groups) కలవు. 100% పాస్ ANU, AU, SV యూనివర్శిటీల ద్వారా డిగ్రీ, పి.జి కోర్సులు కలవు. సి.క్యాంప్, కర్నూలు. 93915 01095 [L-798816]

■ REGULAR/DISTANCE/ DISCONTINUED/ FAILURES/ DIRECT FINAL YEAR: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, B.B.A, B.C.A, BED, MPED, LLB, MLT, DMLT, OT, MPHW, MBA, MCA, AGBSC, PHD. 8686172989 [L-798818]

ADMISSIONS
■ APOSS ద్వారా ఓపెన్ ఇంటర్ అడ్మిషన్స్. MPC, BIPC, CEC, HEC గ్రూప్‌లలో అడ్మిషన్లు కలవు. సీట్లు పరిమితం. 98854 85281, 99593 62229. [L-798813]

REAL ESTATE

LAND FOR SALE
■ ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని నాగిరెడ్డిపల్లెలో వ్యవసాయ భూమి అమ్మబడును. కావలసిన వారు సంప్రదించండి సెల్: 8247258453 [T-1200067]

WANTED
■ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పని చేయుటకు సేల్స్ మెన్స్ &గర్ల్స్, ఫ్లోర్ ఇంచార్జ్, అనుభవం గల క్యాషియర్ కావలెను. మంచి శాలరీ+ఇన్సెంటివ్స్. అబ్దుల్లాఖాన్ ఎస్టేట్స్, కర్నూలు. 81858 37786 [L-781020]

■ కర్నూలు నగరంలో మా సంస్థ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గంటల డ్యూటీ మంచి జీతం వయసు 18 నుండి 45 సం॥ వివరాల కొరకు సంప్రదించండి:91829 64173 [L-798825]

■ శ్రీ వెంకటేశ్వర అకాడమి నందు పని చేయుటకు అనుభవం గల లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: ఇంటర్/డిగ్రీ. సం.ప్ర: సి.క్యాంప్ సెంటర్, కర్నూలు.93915 01095 [L-798817]

■ కర్నూలులో డోర్ టు డోర్ మరియు పర్సన్ టు పర్సన్ సేల్స్ ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు బాయ్స్ కావలెను. జీతం: 12,000, వివరాలకు సం.ప్ర: 80746 72246 [L-781015]

■ WANTED LADY RECEPTIONIST, Basic Computer Knowledge & English Speaking and Writing. Contact: ROJA'S Hearing Speach & Multi speciality Rehabilitation, Centre: Near Shakuntala kalamandir, KNL. 08518-271900, 94936 00900. [L-781018]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సం.ప్ర. 95736 33520, 90596 33520. [M-1221732]

■ మన పట్టణంలో కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు ఇంటర్, డిగ్రీ చదివిన వారికి అవకాశాలు కలవు. సం.ప్ర॥8179 175150 [G-37]

■ జాబ్ గ్యారెంటీ మహిళలకు మా కంపెనీలో ఉచిత రూం+భోజనం ఇచ్చి జాబ్ ఇవ్వబడును. జీతం: 20,000/- వరకు ఏజెంట్స్ (1 మనిషికి: 5000/- కమీషన్) Ph: 8886733005/ 008 [H-793357]

■ కన్సల్టెన్సీకాదు. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ:12,000/- - 35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 7995984445. [HA-668]

■ రెయిన్‌బో కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు కావలెను. 10th, ఇంటర్, పాస్/ఫెయిల్ కమీషన్ ఇవ్వబడును, 2వీలర్ కంపల్సరీ, ఫోన్ : 9398981980 [H-793460]

■ నంద్యాల మా బ్రాంచ్ నందు ఆన్‌లైన్ ఉత్పత్తులు డెలివరీ చేయడానికి డెలివరీ బాయ్స్ కావలెను. జీతం: 20,000/- నుండి 30,000/-, బైక్, స్మార్ట్ ఫోన్ ఉండాలి. వయస్సు: 18+Ph: 8686242288/ 9346553343 [HA-677]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725